# టైపిస్టు రాణి

శ్రీమతి సత్యవతి

ఆ అమ్మాయి పేరు రాణి ... పద్మారాణి. పేరు విని ఏ రాకుమార్తో, జమీందారిణో అని అనుకునేరు! వాస్తవానికి ఆ అమ్మాయి ఒక రిటైర్డ్ మునిసిపల్ క్లర్క్‌గారి ముద్దుకూతురు. స్కూల్ ఫైనలు చదువుతుండగనే కుటుంబంలో పెద్ద పెద్ద మార్పులు పెనుభూతాల్లాగ ఎదురైనయి. దాంతో రాణీ ఆశాసౌధాలపై పసిడిపూతలు రాలిపోయినై. అంతస్తులు విరిగి బోడి గోడలు మిగిలినయి. ఏనాడూ తలవనిదారులు తెరుచుకున్నయ్. వాటిగుండా తప్పటడుగులు వేస్తూ నడక ప్రారంభించింది.

జరిగిన పెద్ద మార్పుల్లో, తల్లి హఠాత్తుగా స్వర్గస్తురాలవటం, తండ్రి రిటైరవటం, తను చదువుకి స్వస్తి చెప్పటం రాణి భావి జీవితాన్ని పూర్తిగా దిగతొక్కనియ్య. వున్నత విద్యావంతురాలిని తప్ప పెళ్ళాడననే ఇంజనీరు మాఁవయ్య అదును చూసుకుని పైసంబంధం చేసుకున్నాడు. ఇక రాణీకి మిగిలింది తండ్రికి సుశ్రూష చేయుట యొక్కటే.

వచ్చిన ప్రోవిడంట్ ఫండ్‌తో ఒక కొంప కొన్నారు. అందులోనే ఒక ప్రక్కవుంటూ మిగిలింది అద్దెకిచ్చారు. అదే ప్రస్తుత జీవనాధారం. రాణీ తండ్రికి సంతోషంగా సేవజేస్తూ గడుపుతూనే వుంది. కాని నానాటికీ రాణి ముఖంలో అలుముకుంటున్న అసంతృప్తిరేఖలు ఆ వేళ తండ్రీ కూతుళ్ళమధ్య చిన్న వివాదాన్ని లేవదీసినయి. పర్యవసానంగా రాణీ దిండులో తలదూర్చి ఏడుస్తుంది - "అమ్మవుంటే నా బ్రతుకు ఇలా తేలిపోయేదేనా!" అన్న భావం స్ఫురించిందా వెక్కి వెక్కి ఏడవడంలో. దానిని తండ్రి భరించలేకపోయేడు. దగ్గరకు వెళ్ళి బ్రతిమాలుతూ "అమ్మా! రాణీ - నామాటవిను ... మంచిదానవు గదూ! నువ్వలాగున ఏడిస్తే నేను బ్రతకగలనా! లే, నాముఖంచూచైనా లేఅమ్మా; కొడుకువైనా కూతురువైనా నువ్వే నన్ను సంతోషపెట్టేవు, నువ్వా ఇలా పట్టుపడితే ఎలా చెప్పమ్మా" అంటూ ఒడిలోకి తీసుకుని కళ్ళనీళ్ళు తుడిచేను.

"లేస్తాన్లేనాన్నా! - ఏమయిందిప్పుడు ..." అన్నాదేకాని తండ్రి మాటలకికరిగి, లేవలేదు.

"ఇంకా ఏమవ్వాలమ్మా, వున్న ఒక్కదానివి అలా ప్రొద్దుట్నుంచి కన్నీళ్లు కార్చటంకన్నా ... నువ్వు శుభ్రమైన బట్టకట్టుకుని, నగబెట్టుకుని సరదాగా తిరిగితే చూచి ఆనందించేకన్నా నాకు కావలసిందేఁవిటమ్మా! - కాని ఈ దౌర్భాగ్యుడు దానికి నోచుకోలేదు. విధి నిర్ణయం అలావుంది. ఇదే మగాడైతే నీ వయసొచ్చేప్పటికి స్వంత రెక్కలమీద నిలబడి స్వేచ్ఛ, సౌఖ్యం సంపాదించుకుంటాడు. ఆడదాని బ్రతుకు ఒకడిచేతిలో పడ్డాకనే సుఖపడుతుంది. అందుకనే కాస్త తిండీ గుడ్డ అయినా ఇచ్చేవాడి చేతిలో పెడదామనే ఆశ, ప్రయత్నమూను, అంత వరకూ ఇలాగే తినో తినకో గడుపుకోవాలి. ...

"అది, ఆదినుండివచ్చే ఆచారం. స్త్రీకిసంఘంలో ఒక ఉన్నతమైన ఉత్కృష్టమైన స్థానం వున్నాది. దాన్ని, ఈ నాడు, చిన్న చిన్న ఐహిక సౌఖ్యాలకు, అర్థంలేని అహంకారాలకులోబడి కాలదన్నుకోవటం శ్రేయస్కరంకాదు. సంఘమే, స్త్రీకి, హంసతూలికాతల్పమౌతుంది. నిప్పుకణికకు జడిచినట్టు జడుస్తుంది. అదే స్త్రీ నీతితప్పి నీతిమాలి ప్రవర్తించినప్పుడు, మరణశయ్యగా మారగలదు, బూడిదను వూదినట్టు వూదేయగలదు. ...

"ఏదో మీ క్లాస్‌మేటు ఎలీనా, ఆపరేటరుపని చేస్తున్నాదని, పక్కింటివారి రమణమ్మ, పంతులమ్మ పనిచేస్తుందని, సంపాదించుకొని సౌఖ్యపడుతున్నారని నువ్వూ ఉబలాటపడితే ఎలాచెప్పు. నువ్వు ప్యాసవగలిగింది, ఉద్యోగం చేయగలిగిందీ, నిజమే అయి

(1220 పేజీ చూడుడు)

(1194 పేజీ తరువాయి)

నప్పటికీ రాతలో లేనినాటికోసం ఆశించి ప్రయత్నిస్తే ఏమికీడు సంభవిస్తుందో అని నా భయం - ఆడపిల్ల రాజ్యాలేలుతూ సంపాదిస్తే తింటున్నాడు అంటే నాకు బాధలేదు, కాని ఆ "రాజ్యాలేలుతుంది" అన్నమాటచాలు, నీ జీవితాన్ని నాశనంచేయడానికి; నన్ను నలుగుర్లో తలెత్తుకోకుండా ... ... చెయ్యగలదు. పెళ్లిగావలసినదానవు - బంధువులు, ఆత్మీయులే ముందు ఏదో భూటకపు ప్రచారం సాగిస్తారు. వీటన్నిటితో ఆత్మశాంతి అంటూలేకుండా జీవితం చాలించాల్సి వస్తుందేమోనని నా బాధ, - అంతే. ఊఁ - లేమ్మా! బంగారు తల్లివిగదూ!"

తండ్రి గొంతులోని గద్గదతను గమనించి కన్నెత్తి చూచింది. చెక్కిళ్ళమీదుగా జారుతున్న కన్నీళ్ళను చూచి తృళ్ళిపడ్డాది.

"లే నాన్నా! స్నానంచేద్దువుగాని, భోంచేద్దాము" అని తండ్రిని లేవదీసింది.

స్నానం చేస్తూండగా "కష్టపడి, సుఖపడటంలో అవమానాలు, అహంకారాలు ఏమున్నయ్" అని ఎవరో తట్టినట్టయింది.

చిరునవ్వుతో వచ్చి విస్తరిముందు కూర్చున్నాడు. "అరశతాబ్దం క్రిందటి ఆచారాలను తనింకా అములులో పెట్టగలడా" అనుకుంటూ, అయితే "రాణీ! నువ్విప్పుడేమంటావు - ఉద్యోగం చేస్తానంటావుగదూ! అది అట్టే మంచిపనిగాదమ్మా" అని కదిపేడు అసలు ఉద్దేశాన్ని వెల్లడిచేయకుండా.

రాణి ఏమీమాట్లాడకుండా, తలవంచుకొని భోజనంచేస్తుంది. - తండ్రి చెప్పినదంతా బాగానే వుందికాని ప్రత్యేకం ఆ రెండు విషయాలే అర్థంలేనివిగావున్నాయి. విధికి ఎదురీదడం అంటాడు. ఎదురీదడం ఏమున్నాది! ఎంతమంది స్వయంకృషి వల్ల, స్వయందీక్షవల్ల జీవితాన్ని మధురమయంగా జేసుకోలేదు! ఎంతమంది తారాపథాల్లోకి జేరుకోలేదు. అసలు విధిలోనే అలా రాసివున్నాదని ఎందుకనుకోగూడదు - ప్రయత్నించే స్థిరపర్చుకోగూడదు!

ఇక గౌరవం, మంచి, మర్యాదా, బంధువులూ బండరాళ్ళూ అంటారు. నిజానికి తనకి వున్నవాళ్ళు అరడజనుమంది మేనమామలు, చదువుకుని అన్ని విధాలా బాగా వున్నవాళ్లు, ఒక్కడైనా, ఒక్కనాడూవచ్చి తననిగాని, తన తండ్రినిగాని చూచినవాళ్లున్నారా! ... తననుకోగూడదుగాని, తనకంటే ఏఁవంత అందగత్తె అని, మెజిస్ట్రేటుగారి కూతుర్ని చేసుకున్నాడు ఆఖరి మాఁవయ్య - ప్రేమించేనన్నాడు - పెద్ద చదువు అన్నాడు. ఇంటరేగా! అదైనా ఫెయిలయింది. ఆవిణ్ణి ప్రేమించగలిగిన ఏపాటి మగాడైనా తనని ప్రేమించగలడు. ఎటొచ్చి ఆవిడ డబ్బున్న వాళ్ళమ్మాయి! తనో దరిద్రగొట్టు అని - అంతే - ఇకనలాంటపుడుకూడా నాన్నగారికెందుకో అంత భయం ... ...

"ఏమంటావమ్మా! - మాట్లాడవేం" అన్నాడు తండ్రి మళ్ళీ.

"ఏమున్నాది నాన్నా! - పరువూ మర్యాదా, స్నేహితులు, చుట్టాలు అంటావుగాని, మనం ఎలా బ్రతుకుతున్నామో, అసలు మనకీ లోకానికీ సంబంధం వుందంటావా - !" ఇంతసేపు ఆలోచించిన దాన్ని పైకి అనేసింది.

"అబ్బబ్బ వుండుని పుల్లపెట్టి కెలికినట్టుందమ్మా రాణీ - అందుకనే నావంటివాడిప్పటిరోజులకు పనికిరాడు. కాలం చాలించాలి అంటాను ... ఎంతసేపు మీ దృష్టిలో గౌరవం అన్నా, మర్యాదా అన్నా వేషాలు వేసుకు తిరగడం, లేనిది వున్నట్టుగా నటించడం అనే అభిప్రాయంగాని, నీతికి, నిజాయితీకి, ఆత్మగౌరవానికి స్థానమే లేదు. ప్రస్తుతపు లోకమే అలా మారిపోయిందమ్మా, పేగులు మాడిపోతున్నట్టు ఆకలిదహిస్తున్నా, సుష్టుగా భోజనంచేసినవాడికి మల్లే తేనుస్తూ బయటికిరావటం, లోపల వస్త్రయినా లేకపోయినా పైన పన్నెండు గుండీలకోటు వేసుకోవటం ... చివరకి ఇవన్నీ ఆత్మవంచకాలని తెల్సినప్పుడు సిగ్గుపడతారు ... "

తండ్రి అంత కష్టపెట్టుకుంటాడనుకోలేదు రాణి.

"ఇక నువ్వు వెళ్ళి నీకు నచ్చినట్టు ఏర్పాటు చేసుకో, నేనుకూడా లేననుకుని. వుండి ఏమి నిర్వాకం చేశాను! గనుక, ఎలా అయితే అలాగే అవుతుంది."

తండ్రి అన్న మాటలకి మళ్ళా ఒక్కసారి, పాత కన్నీటిచారికలు ప్రవాహంతో నిండుకున్నాయి. చాలాసేపు ఆలోచించింది. ... ... తండ్రి చెప్పినట్టు స్త్రీకి భర్త చేతిలోనే సుఖపడే ఘడియ లేవేమో! ... ఏమిటా సౌఖ్యం, అంతా అయింతరువాత అయినా అంత భర్త చేతిలో లాలనలు పొందేందుకు తనేమి ఇంజనీరుగారి భార్య అవుతుందా, కలెక్టరుగారి కోడలవుతుందా! చచ్చిచెడి ఓ వందరూపాయల గుమాస్తా గారిభార్యవుతుంది; ... తనని తనుకనే పిల్లల్ని పోషించేసరికే, "ఆ భార్యంటే" ఆ-భర్తగారికి అసహ్యం జనిస్తుందా, లేక గౌరవం కలిగేందుకేమైనా ఆస్కారం వున్నదా! ... అక్కడా ఈ జీవిత మాధుర్యాన్నే ఇంకో పాత్రనుండి చవి చూస్తుంది; దాంతోసరి - జీవితంలో మధుర ఘడియలకు నియమించబడ్డ కోలమ్స్ కాసిన్ని.

మధ్యాహ్నం లేచింతరువాత, ఓ పావుగంటసేపు అటకవాసాలు లెక్కపెట్టేప్పటికి, ఒక ఆలోచన హఠాత్తుగా నిర్ణయంఅయి కూర్చుంది. దాంతో రాణీకి ఎక్కడలేనిబలం, సంతోషం సమకూడేయి. తండ్రికి కాస్త టీ ఇచ్చి, తనూ పుచ్చుకుని స్నేహితురాలు ఎలీనా దగ్గరకి బయల్దేరింది.

వెళ్ళగానే స్నేహితురాలు రెండు చేతులా ఆహ్వానించి మర్యాద చేసింది.

ఇద్దరూ చాలా పాతవి, పాతవి, కొత్తవి, సరి క్రొత్తవి మాట్లాడుకున్న తరువాత, టీ కలుపుతూ, "అసలు ఏదో క్రొత్తగావుందే, నువ్విలా రావడం" అన్నాది ఎలీనా.

"ఏం రాకూడదా, స్నేహితురాలువి కనుక వచ్చాను" - ఉపోద్ఘాతంగా అని నవ్వింది రాణి.

"అబ్బే! - నీలాటి బంగారుకోడిపెట్ట అణుకు మాని మా యింటికొచ్చిందంటే, ఏదో వున్నదన్న మాటే లక్ష్మీప్రసాదం ... మారేజ్ ఏమేనా..."

"ఆఁ - అదొక్కటే దిగడిపోయింది - దానికేం గాని ఎలీనా, నాకూ టైపూ, షార్టుహాండు నేర్చుకొని, ఉద్యోగం చెయ్యాలనుంది ..."

"ఏమిటి రాణీ! నువ్వు ఉద్యోగం చేస్తావా" ఆశ్చర్యంగా.

"ఏం - ఎందుకంత ఆశ్చర్యం? నువ్విచ్చిన సలహాయేకదూ ఒకప్పుడు."

"అవుననుకోమి - ఫాదర్‌కి బొత్తిగా ఇష్టంలేదన్నావుకదూ!"

"ఫాదర్‌ని ఒప్పించేను - ఇక నువ్వు చేయవలసిన మహోపకారం ఒకటివుంది ..."

"ఏఁవిటది?"

"ఇపుడు ఇన్‌స్టిట్యూట్‌కి, అరవయ్యో, డెబ్బయ్యో కావాలిగదూ, అది నువ్వు సర్దితే" అన్నాది రాణి గుండెలమీదనుంచి ఎంతో బరువు దించుకున్నట్టు.

ఆ బరువంతా స్నేహితురాలి గుండెలమీద పడనే పడ్డాది చెక్కుచెదరకుండా.

"ప్రస్తుతం నాదగ్గర ఏమీలేదు రాణీ ఏదో ఇంటి ఖర్చులకుమినహా."

"మరికనెందుకు నేనీ గాలిమేడలుకట్టడం - వున్న ఆయువుపట్టుకూడా రాలిపోయింది."

"ఏమీ అనుకోవు గదు రాణీ! నిజంగా చెపుతున్నాను, నెలాఖరుకు చేతిలో చిల్లికానీ మిగలదు. అందరూ అనుకుంటారు మొగుడూ పెళ్ళాం సంపాదిస్తున్నారు, వెనకెయ్యక ఏంజేస్తారదంతా అని...."

రాణీ మౌనానికి ఎలీనా చాలా చింతపడ్డాది. నిజంగా రాణి తన మాటలు నమ్మకే అలా వూరుకున్నాదని. కాని, రాణీ తన కూలిపోయిన ఆశాసౌధాల్లో దేన్నో వెతుక్కుంటూవుంది.

కాలం శబ్దాన్ని ఆశ్రయించింది క్షణంసేపు.

"ఒకపని చేద్దాం రాణీ!" అన్నాది ఎలీనా, గజబలంతో.

"ఏఁవిటది" రాణీ నీరసంగా అడిగింది.

" - నీకు అంతసొమ్ము ఒక్కసారే ఎందుకు. నెలనెలా ట్యూషన్ ఫీజు పదో, పన్నెండో ఇస్తుంటాను."

(సశేషము)